నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | మంగళవారం 4 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## వామ్మో పెద్దపులి..

- దుబ్బగూడెం, పెద్దనపల్లి, బుగ్గగూడెం గ్రామాల సమీపంలో సంచారం

కాసిపేట, జనవరి 3 : కాసిపేట మండలంలోని శివారు గ్రామాల్లో జనవాసాలకు దగ్గరగా పెద్దపులి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వారం రోజులుగా దుబ్బగూడెం, సోమగూడెం పాతబస్తీ శివారు ప్రాంతాల మీదుగా పెద్దనపల్లి, బెల్లంపల్లి మండలం కన్నాల, బుగ్గగూడెం మధ్య పెద్దపులితో పాటు చిరుత సంచరిస్తుండడంతో ఆయా ప్రాంతాల వాసులకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. రెండు రోజుల క్రితం అడవి పందిని చంపిన పెద్దపులి సగం తిన్నది. ఆపై తెల్లారి మరోసారి వచ్చి అడవి పంది కళేబరాన్ని లాక్కెళ్లింది. నిత్యం ఎక్కడో చోట పులులు కనిపిస్తుండడంతో పంట పొలాల వైపు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని వారు అధికారులను కోరుతున్నారు.

## గోలేటి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



గోలేటి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న డిపెండెంట్స్ ఉద్యోగ బాధితులు

రెబ్బెన, ఫిబ్రవరి 3 : సింగరేణి కారుణ్య నియామకాల్లో డిపెండెంట్స్ ఉద్యోగ బాధితుల మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు డిమాండ్ చేశారు. చలో కొత్తగూడెం పోరుయాత్రలో భాగంగా సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లోగల జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మారుపేర్ల సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, అనేకసార్లు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్మిక సంఘాల నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు క్రిష్ణ, ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషా, కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, హెచ్ఎంఎస్ కార్యదర్శి క్రిష్ణస్వామి, ఉద్యోగ బాధితులు తిరుమల శ్రీనివాస్, లక్క శ్రావణ్, రామిండ్ల సందీప్, ఓంప్రసాద్, దుమ్మటి రాజు, జిల్లాల శ్రావణ్, ఈర్ల సతీశ్, మాచర్ల నవీన్‌కుమార్, సునీల్‌రెడ్డి, హరీశ్, వెంకటస్వామి, కుమార్‌యాదవ్, హిమబింధు, కొమురమ్మ, భీరయ్య, ప్రదీప్‌కుమార్, నరేశ్, రమేశ్, సతీశ్‌కుమార్‌యాదవ్ ఉన్నారు.

### ❖ కొనుగోళ్లు నిలిపేసి పది రోజులు దాటింది



నా దగ్గర పది నుంచి పదిహేను క్వింటాళ్ల పత్తి ఉంది. సీసీఐకి అమ్ముదామని ఎదురుచూస్తున్నా. చెన్నూర్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేశారు. నాలాంటి రైతులెందరో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గ్రామంలో రైతులు కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయని ఎదురుచూస్తున్నారు. సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి దాకా సక్రమంగా పత్తి కొన్నది లేదు. వారంలో రెండు లేదా మూడు రోజులు కొనుగోలు చేస్తే, మిగిలిన రోజులు బంద్ పెడుతున్నారు. ఆగితే ఆగండి లేకపోతే బయట అమ్ముకోండంటూ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానాలిస్తున్నారు. రైతు డేటా లేదంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. డేటా ఎంట్రీ చేసేటప్పుడు పత్తికి బదులు వరి సాగు చేసినట్లు తప్పుడు ఎంట్రీ చేస్తే దానికి రైతు ఏం చేస్తాడు. అలాగని కొనకపోతే ఎలా. ఎదురుచూసి ఇక పంట ఎక్కడ పాడైపోతుందోనని కొందరు ప్రైవేట్‌లో అమ్ముకుంటున్నారు. మండలంలో ఇప్పటి వరకు 50 శాతం రైతులే సీసీఐకి పత్తిని విక్రయించారు. అనేక మంది పత్తి ఇండ్లలోనే నిల్వ చేసుకొని ఎప్పుడు సీసీఐ కొనుగోళ్లు చేస్తుందా అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే మా మండలంలో పత్తి కొనుగోళ్లు నిలిపివేసి 10 రోజులు దాటింది. వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నాం.

**- నరిగె శ్రీశైలం, రైతు, కాచన్‌పల్లి గ్రామం, చెన్నూర్**

### ❖ ఇంట్లోనే పత్తి నిల్వ చేసుకున్నా



పత్తి తీయడం మొదలైనప్పటి నుంచి సీసీఐ వాళ్లు ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారు. నేను బోయపల్లి గ్రామ శివారులో 13 ఎకరాల్లో పంట సాగు చేశాను. సుమారు 130 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. విడుతల వారీగా పత్తి అమ్మడానికి తాండూర్ మండలంలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకుపోతే బంద్ ఉంది. దళారులకు అమ్మితే నష్టపోయే ప్రమాదముందని ఇంట్లోనే పత్తిని నిల్వ చేశాను. సీసీఐ కొనుగోలు కేంద్రం నెలలో కొన్ని రోజులే తెరుస్తుండడంతో రైతులందరం నష్టపోతున్నాం. పత్తికి సరైన మద్దతు ధర ఇవ్వాలి. ఇప్పుడున్న ధరకు పెట్టిన పెట్టుబడి కూడా వస్తలేదు. క్వింటాలుకు రూ.10 వేలు ప్రకటించాలి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో క్వింటాలుకు రూ.9 వేలు ఇచ్చారు. ఆనాటి ప్రభుత్వం పట్టించుకున్నట్లు ఇప్పుడున్న నాయకులెవ్వరూ చొరవ చూపడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట విక్రయించడానికి అష్టకష్టాలు పడుతున్నాం. పత్తి కొనుగోలు కేంద్రాలు ఎప్పుడూ మూసి ఉండడంతో నాతోటి రైతులు చేసేదేమీ పత్తి మిల్లుల యాజమానుల, దళారులను ఆశ్రయిస్తున్నారు. అడ్డికి పావుశేరు వాళ్లు అడిగే ధరకు పంట అమ్ముకొని నష్టపోతున్నాం. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతుంది. పత్తి నిల్వ చేయడానికి స్థలం లేకపోయే. పత్తి ఏరిన కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి వస్తుండే.. ఇలాంటి పరిస్థితుల్లో చేసేదేమీ లేక ప్రైవేట్ వ్యాపారులే మాకు దిక్కు అవుతున్నారు.

**- మాసాడి శశివర్ధన్, బోయపల్లి గ్రామం, తాండూర్**


చెన్నూర్‌లోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం

# దూది రైతు దుఃఖం

## మంచిర్యాల జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు బంద్

- మాటిమాటికీ మూసి ఉంటుండడంతో అన్నదాతల అవస్థలు
- దిక్కుతోచని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్న వైనం
- ఈ నెల పదో తేదీ దాకా కొనుగోళ్లు అంతంతే..!
- నిరంతరం కొనేలా చూడాలని కర్షకుల వేడుకోలు

మంచిర్యాల, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో సీసీఐ కొనుగోళ్లు పర్వాలేదనిపిస్తున్నా, మంచిర్యాల జిల్లాలో మాత్రం కొనుగోలు కేంద్రాలు మాటిమాటికీ మూసి ఉంటుండడంతో కర్షకలోకం అవస్థలు పడుతున్నది. ప్రస్తుతం ఎక్కడా పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదని, తమ గోడును పట్టించుకోవాలని వేడుకుంటున్నది. చెన్నూర్ మండలంలో నాలుగు కేంద్రాలు, కోటపల్లిలో ఒకటి, బెల్లంపల్లి పరిధిలోని రెండు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేశారు. జిన్నింగ్ మిల్లుల్లో పత్తి, గింజల నిల్వలు అధికంగా ఉన్నందున కేంద్రాలు బంద్ చేసినట్లు మార్కెట్ కమిటీలు చెబుతున్నాయి. మూడు, నాలుగు రోజులు ఇలాగే బంద్ ఉంటాయంటూ ప్రకటనలు సైతం విడుదల చేశాయి. మరోవైపు రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు రావడంతో 8, 9 తేదీల్లోనూ కొనుగోళ్లు జరిగేలా లేవు. ఈ లెక్కన ఈవారం మొత్తంలో ఒకటీ, రెండు రోజులు మినహా 10వ తేదీ దాకా కొనుగోళ్లు చేపట్టే అవకాశం లేదు. ఇలా ఈ నెలలోనే కాదు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటి నుంచి కొనుగోళ్లు చేసిన దానికంటే మూసి ఉన్న రోజులే ఎక్కువని రైతులు మండిపడుతున్నారు. రైతులను ముంచేందుకే వ్యాపారులు, అధికారులు కలిసి కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేక పత్తి దిగుబడి తగ్గిందని.. సీసీఐలో కొనుగోలు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. దళారులకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడులు సైతం రాక అప్పుల భారం మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సీసీఐ కొనుగోలు కేంద్రాలు బంద్ లేకుండా, సీజన్ పూర్తయ్యే దాకా పత్తి కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

### ❖ చేతిలో చిల్లిగవ్వ లేక ప్రైవేట్‌కు అమ్ముతున్నా



సీసీఐ పత్తి కొనుగోళ్లు బంద్ చేయడంతో చేతికి వచ్చిన పత్తి పంటను దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. పెట్టిన పెట్టుబడికి, కూలీలకు ఇచ్చేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక తక్కువ ధరకు పత్తిని ప్రైవేట్‌కు అమ్ముకొని నిలువునా మునుగుతున్నాం. నేను బోయపల్లి-మదనాపూర్ శివారులో 8 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సీసీఐలో అమ్ముకుందామని పోతే ఎప్పుడూ బందే ఉంటుంది. పత్తి కొనుగోళ్లు మొదలైన రోజు నుంచి కొనుగోలు కేంద్రం తీసి ఉన్నదానికంటే మూసి ఉన్న రోజులే ఎక్కువ. ఈ ఏడాది రైతుబంధు రాలేదు, రుణమాఫీ కూడా సక్కగ కాక రైతులందరం అవస్థలు పడుతున్నాం. చేతిలో చిల్లిగవ్వ లేకుండాపోయింది. పత్తి తీసిన కూలీలకు డబ్బులు ఇవ్వడానికి అప్పు చేయాల్సి వస్తున్నది. సీసీఐ కొనుగోళ్లు చీటికీమాటికీ బంద్ చేయడంతో 30 క్వింటాళ్ల పత్తి ప్రైవేట్‌కు అమ్ముకునేందుకు సిద్ధమయ్యా.

**- మాసాడి నాగరాజు, బోయపల్లి, తాండూర్**

### ❖ ఆదేశాలు రాగానే కొనుగోళ్లు చేపడుతాం

జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో అధికారుల ఆదేశాల మేరకు సీసీఐ కొనుగోళ్లు నిలిపివేయడం జరిగింది. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలు రాగానే చెన్నూర్‌లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపడుతాం. రోజుకు 50 నుంచి 100 పత్తి బండ్లకు టోకెన్స్ ఇచ్చి కొనుగోళ్లు చేపడుతాం. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. రైతులు ఒకేసారి కాకుండా దశలవారీగా పత్తిని అమ్ముకోవాల్సిందిగా కోరుతున్నాం.

**- రామాంజనేయులు, చెన్నూర్ మార్కెట్ కమిటీ సెక్రటరీ**

### చిత్తశుద్ధితో సర్వే చేయలేదు..



కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఈ సర్వే చేయలేదు. బీసీలను తగ్గించి చూపాలనే అగ్రవర్ణాల కుట్రలో భాగమే లోపాల పుట్టయిన ఈ సర్వే వివరాలు. బీసీ జనాభాను తగ్గించి, రిజర్వేషన్లు రాకుండా చేయాలనే కుట్ర దాగుంది. దీనికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుంది. రాబోయే రోజుల్లో బీసీల తడాఖా చూపిస్తాం.

**- వడ్డేపల్లి మనోహర్, జిల్లా బీసీ జేఏసీ నాయకుడు, మంచిర్యాల**






## సమగ్ర కుటుంబ సర్వే సరిగ్గా చేయలేదంటున్న బీసీలు

- బీసీ జనాభాను తక్కువ చేసే చూపించారనే ఆరోపణ
- అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లుపెట్టాలంటూ డిమాండ్

మంచిర్యాల, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతంగా ఉందని చెప్పిన సర్కారు.. సర్వే సరిగా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో లక్షలాది కుటుంబాలను సర్వే చేయకుండానే బీసీ జనాభాపై స్పష్టత ఎలా వచ్చిందంటూ బీసీ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇంకా 16 లక్షల మంది వివరాలు సేకరించలేకపోయామని చెప్తున్న సర్కారు.. తుది లెక్కలను ఎలా తేల్చిందో చెప్పాలంటున్నారు. గత సర్కారు చేసిన సర్వేలు, అంచనాల మేరకు రాష్ట్రంలో బీసీ జనాభా 50 శాతం నుంచి 52 శాతం ఉండాలన్నారు. కాంగ్రెస్ సర్కారు కేవలం 46.2 శాతం బీసీలు ఉన్నట్లు తేల్చడం బాధాకరమంటున్నారు. సకల జనుల సర్వేకు ఇప్పుడు చేసిన సర్వేకు బీసీ జనాభా 21 లక్షలు తగ్గిందంటున్నారు. ఎక్కడైనా జనాభా పెరగాలే తప్ప, తగ్గడం ఏంటో అర్థం కావడం లేదంటున్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే బీసీ జనాభాను తక్కువ చేసి చూపించారంటూ మండిపడుతున్నారు. ఇప్పుడు సర్కార్ తీసిన లెక్కల మేరకైనా అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టకుండా చర్చతో లాభం ఏం ఉండదంటున్నారు. ఇలా కాని పక్షంలో మరోసారి కులగణన చేయాలని, బీసీ జనాభా ఎంత ఉందో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. రిజర్వేషన్లు అమలు చేయాలంటూ రాజ్యాంగం పట్టుకుని దేశమంతా తిరుగుతున్నా రాహుల్ గాంధీ.. తెలంగాణ బీసీల విషయంలో అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సర్వే చేసి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ❖ రిజర్వేషన్ శాతం తగ్గించే కుట్ర..



నిర్మల్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనకు ఎలాంటి శాస్త్రీయత లేదు. అన్నీ తప్పుడు లెక్కలే. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలను పరిగణలోకి తీసుకోకుండానే 50 శాతానికి పైగా బీసీలే ఉన్నరు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ తప్పుడు గణాంకాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది. ముస్లిం మైనార్టీలు 10 శాతం, బీసీలు 46 శాతం కలుపుకొని మొత్తం 56 శాతం ఉన్నరని చెప్పడం దారుణం. ముస్లింలను కలపక ముందే బీసీల జనాభా 55 నుంచి 56 శాతం ఉంటుంది. ఈ తప్పుడు లెక్కలను ప్రభుత్వం వెంటనే సరి చేయాలి. లేకుంటే మళ్లీ కుల గణన సర్వే చేసి వాస్తవాలను బయట పెట్టాలి. ప్రస్తుత లెక్కలతో రిజర్వేషన్లు కల్పిస్తే బీసీలకు అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. కొత్తగా చెబుతున్న బీసీల సంఖ్య బూచీ చూపించి రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించే కుట్రలకు పాల్పడితే ఊరుకోం. ఈ కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే రైతుభరోసాను రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రూ. 12 వేలకు తగ్గించారు. అదేవిధంగా ఇప్పుడు బీసీల సంఖ్యను తక్కువగా చూపించి రిజర్వేషన్ శాతాన్ని కూడా తగ్గించే అవకాశమున్నది.

**- ఎంబడి చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నిర్మల్**

### ❖ తప్పుల తడకగా సర్వే..



ఈ సర్వే తప్పుల తడకగా ఉంది. బీసీ జనాభా ఉన్నదాని కంటే తక్కువగా చూపించారు. దేశ వ్యాప్త కులగణన ఎందుకు చేయడం లేదు. రిజర్వేషన్లు పెంచడం ఇష్టం లేకనే ఇలా తప్పుడు లెక్కలు చెప్పారు. హిందూ బీసీ జనాభానే 56 శాతం వరకు ఉంటుంది. దీనిపై ప్రభుత్వాన్ని ఎండగడుతాం. సర్వేను ప్రామాణిక పద్ధతులతో చేయలేదు. కుంటిసాకులతో మొత్తం సర్వే చేయలేదు. ప్రజలు అందుబాటులో లేరని బీసీ జనాభాలో కోత విధించారు. **- గుమ్ముల శ్రీనివాస్, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, మంచిర్యాల**

### ❖ శాస్త్రీయత లేని సర్వే



కోటపల్లి, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, ఉపాధి, కుల సర్వే శాస్త్రీయత లేని సర్వే. ప్రభుత్వం పట్టింపులేని తనం కారణంగా మొదటి నుంచి సర్వేలో తప్పులే దొర్లాయి. ఇందుకు నిదర్శనం నాలుగు గ్యారెంటీల అమలులో అర్హుల పేర్లు లేకపోవడమే. ఇలాంటి అసమగ్ర సర్వేను ఏరకంగా ప్రామాణికంగా తీసుకొని బీసీల జనాభా సంఖ్యను నిర్ణయిస్తారు. ఇంకా సర్వేకు దూరంగా 16 లక్షల మంది ఉన్నారు. కానీ సర్వే పూర్తయిందని ప్రభుత్వం చెప్పడం బీసీలను మోసగించడమే అవుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి మరో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. సర్వే చేసి నిజమైన బీసీల సంఖ్యను వెలువరించాలి. **- తాటికొండ సురేశ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం యూత్ నాయకుడు**

### ❖ సర్వే పూర్తి చేయకుండా లెక్కలు ఎలా తేల్చుతారు



కోటపల్లి, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇంటింటి సర్వే పూర్తిగా తప్పుల తడక. రాష్ట్రంలో వంద శాతం సర్వే పూర్తి చేసి నివేదిక వెల్లడించాల్సి ఉంది. కానీ 96.9 శాతం మాత్రమే సర్వే చేసి పూర్తయిందంటే ఎలా? మిగతా 3.1 శాతం కుటుంబాల సర్వే చేయకుంటే సర్వే ఎలా పూర్తి అవుతుంది. అసంపూర్తి సర్వేను ప్రభుత్వం ఆమోదిస్తే బీసీలకు అన్యాయం జరిగే అవకాశముంటుంది. ఇలాంటి అసంపూర్తి సర్వేను ఆమోదిస్తే బీసీలు తీవ్రంగా నష్టపోతారు. సర్వేను పూర్తి చేసిన తర్వాతే గణాంకాలు వెలువరిస్తే బీసీలకు న్యాయం జరుగుతుంది.

**- గాదె శ్రీనివాస్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి**

# కారుణ్య ఉద్యోగాలిచ్చిన ఘనత కేసీఆర్‌దే

- కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అన్నివర్గాలను మోసం చేసింది
- అబద్ధాల రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలి
- టీబీజీకేఎస్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత


టీబీజీకేఎస్ సమావేశంలో మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 3 : సింగరేణిలో 20 వేల మంది యువకులకు కారుణ్య ఉద్యోగాలిచ్చిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కుతుందని ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అధ్యక్షతన పెద్దపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ఇచ్చిన కారుణ్య ఉద్యోగాలతో నేడు సింగరేణి యువ రక్తంతో నిండి ఉందన్నారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిని వారసత్వ ఉద్యోగాలను కారుణ్య ఉద్యోగాలతో భర్తీ చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఎవరూ ఆలోచించని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.500 కోట్ల సింగరేణి నిధులతో మెడికల్ కళాశాలను నిర్మించి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంస్థ నిధులను ఇతర జిల్లాలకు తరలిస్తున్నదనిఆరోపించారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన హక్కులను కోలిండియాతో సంబంధం లేకుండా సింగరేణి కార్మికులకు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 12 శాతం ఉన్న బోనస్‌ను 32 శాతానికి తీసుకువచ్చారని కొనియాడారు. కానీ కాంగ్రెస్ 33 శాతం ఇస్తామని 16 శాతమే లాభాల వాటా ఇచ్చి మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలిచ్చారని, గద్దె నెక్కిన తర్వాత ఏ ఒక్కటీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అబద్ధాల రేవంత్‌కు సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఏర్పాటు చేసిన నూతన జిల్లాలతో ప్రజలకు ప్రభుత్వ పాలన చెరువైందన్నారు. సింగరేణిలో కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా పోతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కాపు శ్రీనివాస్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కార్యదర్శి పానగంటి సత్తయ్య, సహాయ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, వెంకట్‌రమణారెడ్డి, మహిపాల్ రెడ్డి, తొంగల రమేశ్, రఫీఖ్‌ఖాన్, రాజునాయక్ పాల్గొన్నారు.